ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.6 । కనిష్ఠం 24.2
5
కామారెడ్డి
జిల్లా వార్తలు
శనివారం 30 మార్చి 2024





వేడెక్కిన.. రాజకీయం!





- ఎంపీ ఎన్నికలకు సరికొత్త వ్యూహాలు
- సన్నాహక సమావేశాలు, ప్రచార ప్రణాళికలతో హడావిడి
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన ప్రధాన పార్టీలు
- అధికార కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు
- ఎవరి వ్యూహం వారిదే
- ప్రణాళికలు, ఎత్తుగడలతో ముందుకు
- గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు

కామారెడ్డి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. ఆత్మీయ సమ్మేళనాలు, సన్నాహక సమావేశాలు, ప్రచార ప్రణాళికలను అమలు చేసే పనిలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్‌షెట్కార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్, బీఆర్‌ఎస్ తరపున గాలి అనిల్‌కుమార్‌ల అభ్యర్థిత్వాలను ఆయా పార్టీలు ఖరారు చేశాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరికల హడావిడి కొనసాగుతునే ఉంది. ఇతర పార్టీలకు చెందిన ముఖ్యనేతలను పార్టీలో చేర్చుకుంటూ క్షేత్రస్థాయిలో బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేస్తూ కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేస్తోంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటికే ప్రచారాన్ని మొదలు పెట్టింది. మూడోసారి మోదీ అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇలా జిల్లాలో ఒక్కసారిగా పార్లమెంట్ ఎన్నికల రాజకీయం వేడెక్కింది.

ఎవరి వ్యూహాలు వారివే..

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎలాగైన విజయం సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇతర పార్టీల్లోని కీలకనేతలను చేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి పార్టీని బలహీనపరిచే పని మొదలుపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున చేర్చుకుంటున్నారు. ప్రధానంగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. నేడు మున్సిపల్ చైర్‌పర్సన్ అవిశ్వాసాన్ని ఎదుర్కోవాల్సి ఉంది. ఇలా కామారెడ్డిలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.

ప్రణాళికలు.. ఎత్తుగడలు

జహీరాబాద్ బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించిన బీజేపీ ఈసారి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోంది. అభ్యర్థి క్షేత్రస్థాయిలో పర్యటించి జనం మధ్యే ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెందిన పలువురు నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇక బీఆర్‌ఎస్ రాష్ట్రస్థాయిలో అధికారం కోల్పోవడంతో పార్టీ కార్యకర్తలు కొంత నిరుత్సాహానికి గురైన లోక్‌సభ ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ మేమున్నామంటూ రాష్ట్ర నాయకత్వం భరోసా ఇస్తోంది. నియోజకవర్గాల వారీగా కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నాయి. కాన్ఫరెన్స్‌లు, సమీక్షల ద్వారా అలర్ట్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహించారు.

గెలుపే లక్ష్యంగా వ్యూహాలు

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ స్థానంలోని అసెంబ్లీ నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో సమన్వయ కమిటీలు, మండలాలు, గ్రామాల్లో ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేసే పనిలో పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు పిలుపునిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మూడోసారి మోదీ ప్రధాని మోదీ అందిస్తున్న సుస్థిర పాలన గురించి వివరిస్తూ విస్తృతంగా ప్రచారాలు చేయాలని, సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు సూచిస్తోంది. ఇలా ప్రధాన పార్టీలు వ్యూహాలతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.



కాలుష్యం కోరల్లో గ్రామాలు

- భిక్కనూరులో కెమికల్ ఫ్యాక్టరీల నుంచి భరించలేని దుర్వాసన
- ఫ్యాక్టరీల సమీపంలో విద్యా సంస్థలు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు, విద్యార్థులు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


భిక్కనూరులోని కెమికల్ ఫ్యాక్టరీ

భిక్కనూరు, మార్చి 29: మండలంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలు వెదజల్లుతున్న విషవాయువులతో భిక్కనూరు, దోమకొండ, రాజంపేట మండలాల్లోని చాలా గ్రామాలు కంపుకొడుతున్నాయి. రాత్రి అయ్యిందంటే చాలు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే దుర్గంధంతో ముక్కులు పగిలిపోతున్నాయి. భిక్కనూరు మండలంలోని భిక్కనూరు, జంగంపల్లి, అంతంపల్లి, రాజంపేట శివారులో దాదాపుగా 10 వరకు కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటన్నింటిలో భిక్కనూరు శివారులో ఉన్న ఎంఎస్‌ఎన్ ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీ అతిపెద్దది. ఈ ఫ్యాక్టరీలో ప్రస్తుతం ఏ,బీ,సీ,ఈ,ఎఫ్,ఐ బ్లాకులు ఉండగా జీ బ్లాక్ పనులు కొనసాగుతున్నాయి. ఈ కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే దుర్వాసనతో భిక్కనూరు మండలంతో పాటుగా దోమకొండ, రాజంపేట మండలంలోని పలు గ్రామాల్లో చిన్నపిల్లల నుంచి పండు ముసలి వరకు, ముఖ్యంగా భిక్కనూరు మండలంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థులు, జ్యోతిబాపూలే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. మండల ప్రజలతో పాటుగా మండలంలోని 44వ జాతీయ రహదారిపై బస్వాపూర్ నుంచి పొందూర్తి వరకు రాత్రి సమయంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే లారీలు, ఇతర వాహనాలను రోడ్డు పక్కన నిలిపి దాబాల్లో భోజనం చేయాలన్నా, నిద్ర పోవాలన్నా వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ కెమికల్ ఫ్యాక్టరీలకు తోడుగా భిక్కనూరు, రాజంపేట మండలాల్లోని కొన్ని పెద్దపెద్ద కోళ్లఫాంల నుంచి వచ్చే దుర్వాసనతో, ఈగలతో ఆయా మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కెమికల్ ఫ్యాక్టరీలు, కోళ్లఫాంలతో మండలంలోని చెరువులు, కుంటలు, బోరు బావులలోని నీరు కలుషతం అవుతోంది. అస్తమా రోగుల బాధలైతే వర్ణనాతీతం.

వంద రోజులకు పైగా నిరాహార దీక్ష చేసిన కాచాపూర్ గ్రామస్థులు

భిక్కనూరు ఎంఎస్‌ఎన్ కంపెనీ నుంచి వచ్చే దుర్వాసనతో పాటుగా కంపెనీలో వ్యర్థాల కారణంగా చెరువులు, కుంటలు, బోరుబావులు కలుషితమవుతున్నాయని, దీంతో తాము గ్రామాల్లో జీవించలేని పరిస్థితి ఉందని ఆరోపిస్తూ గత కొన్ని రోజుల క్రితం భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామ ప్రజలు పార్టీలకు, కులాలకు అతీతంగా చుట్టూ గ్రామాల ప్రజలను కలుపుకుని వంద రోజులకు పైగా నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు భిక్కనూరు, జంగంపల్లి గ్రామాల శివారుల్లో ఉన్న ఈ కెమికల్ ఫ్యాక్టరీలను మూసివేయాలని ఈ ఫ్యాక్టరీల ఎదుట ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేసిన సంఘటనలు ఉన్నాయి. వీరికి ఏ ప్రజాప్రతినిధి కానీ అధికారులు గానీ సహకరించిన పాపాన పోలేదు. గతంలో ఒకసారి ప్రస్తుత ఎమ్మెల్యే రమణారెడ్డి వారికి కొంత సహకారం అందించి ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన, వ్యర్థాలు రాకుండా ఫ్యాక్టరీపై కొంతమేర ఒత్తిడి తీసుకువచ్చినా కొన్ని రోజుల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ విషయాన్ని అందరూ మర్చిపోయారు. ఆయా గ్రామాల యువకులు ఆయా గ్రామాల్లో కలుషితమైన చెరువు, బోరుబావుల నీటిని ల్యాబ్‌లకు పంపించి ఎంత మేర కలుషితమయ్యాయో రికార్డులతో సహా ఆయా కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, అధికారుల ముందు ఉంచినా ఫలితం లేకపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పాటుగా ఆయా కెమికల్ ఫ్యాక్టరీల సిబ్బంది బెదిరింపులకు పాల్పడటంతో చేసేదేమి లేక వారి ఆందోళన కార్యక్రమాలను విరమించుకున్నారు.

ఈ కంపెనీ తరలించేలా ప్రజలు ఏకం కావాలి

● శ్రీనివాస్, భిక్కనూరు

ఎంఎస్‌ఎన్ కంపెనీ నుంచి వచ్చే దుర్వాసన, వ్యర్థ పదార్థాల వల్ల తమ గ్రామంతో పాటుగా ఈ కంపెనీ చుట్టూ గ్రామాల ప్రజలు, ముఖ్యంగా వ్యవసాయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఆ కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. అధికారులు ఆ కంపెనీ యాజమన్యానికే మద్దతు ఇస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికే ఈ కంపెనీలో ఆరు బ్లాకులు నడుస్తున్నాయి. మున్ముందు పదుల సంఖ్యలో బ్లాకులను ఈ కంపెనీ యాజమాన్యం ఏర్పాటు చేయనున్నట్లు తమకు సమాచారం ఉంది. ఏది ఏమైనా కంపెనీ ఇక్కడి నుంచి తరలించేలా కంపెనీ చుట్టూ ఉన్న బాధిత గ్రామాల ప్రజలు అందరూ ఏకమై అధికారులపై, కంపెనీ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలి.

ఫ్యాక్టరీల సమీపంలోనే యూనివర్సిటీ, పాఠశాలలు

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో జంగంపల్లి, అంతంపల్లి శివారులో ఉన్న కొన్ని ఈ కెమికల్ ఫ్యాక్టరీల సమీపంలోనే తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్, మహాత్మాజ్యోతిబాపూలే, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు ఉన్నాయి. ఇందులో అభ్యసించే విద్యార్థులు నిత్యం ఈ ఫ్యాక్టరీల నుంచి వచ్చే విషపూరిత దుర్వాసన కారణంగా అనారోగ్యం పాలవుతున్నారు. రాత్రైతే చాలు యూనివర్సిటీ, ఆయా పాఠశాలల విద్యార్థులు బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఈ సమస్యపై చాలాసార్లు స్థానిక యువకులు, కొందరు ప్రజాప్రతినిధులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు, జిల్లా అధికారులకు విన్నవించినా చర్యలు మాత్రం శూన్యం.

మృతువ్యాత పడుతున్న చేపలు, పశువులు

మండలంలోని కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలను ఆయా గ్రామాల చుట్టూ ఉండే చెరువులు, కుంటల్లోకి పంపిస్తున్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ వ్యర్థాలతో ఆయా చెరువు, కుంటల్లోని చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఈ చెరువుల్లో నీరుతాగి న పశువులు సైతం కొన్ని మృత్యువాతపడగా, మరికొన్ని అస్వస్థతకు గురైనా సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా కాచాపూర్ గ్రామంలోని పెద్దచెరువులో వేల సంఖ్యలో పలుమార్లు చేపలు మృతి చెందాయి. వ్యవసాయ బోరుబా వుల్లో సైతం నీరు కలుషితమై గడ్డలు గడ్డలు రావడం, నీటి రంగు మారడం, ఈ నీటిని పంటలకు అందించడంతో పంటలు ఎండిపోవడం, సరిగ్గా మొలకెత్తకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. మండలంలోని కొన్ని కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు సదరు ఫ్యాక్టరీల్లోనే బోరు బావులను తవ్వించి అందుల్లోనే ఈ కెమికల్ వ్యర్థాలను పంపిస్తున్నట్లు చాలా ఆరోపణలు ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు

భిక్కనూరు మండలంలోని పలు కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ ప్రజలతో పాటుగా ఆయా కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులను, కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇటీవల మండలంలోని పలు కెమికల్ ఫ్యాక్టరీలో పలు ప్రమాదాల కారణంగా కొందరు మృతి చెందగా ఈ విషయాలు బయటకు రాకుండా అధికారులను మేనేజ్ చేసుకుని మృతుల కుటుంబాలకు నయానో, బయానో ఇచ్చి లోలోపలే సెటిల్ చేస్తున్నారు. మరికొన్ని ఫ్యాక్టరీల యాజమాన్యం ఫ్యాక్టరీ కార్మికులు చేసిన పనికి వేతనాలు, ఫ్యాక్టరీల్లో పలు విభాగాల్లో కాంట్రాక్టర్‌లకు డబ్బులు సరిగ్గా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి ఉంది. కొన్నిరోజుల క్రితం బీటీఎస్ చౌరస్తాలో ఉన్న రాఘవలైఫ్ సైన్సెస్ కెమికల్ ఫ్యాక్టరీలో బస్సులను అద్దెకు పెట్టిన వ్యక్తికి సరిగ్గా డబ్బులు ఇవ్వక పోవడంతో తన భార్యతో కలిసి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఇదే ఫ్యాక్టరీలో ట్యాంకర్, కంకర, డస్ట్, తదితన మెటీరియల్ అందించే కాంట్రాక్టర్‌కు సైతం సరిగ్గా డబ్బులు ఇవ్వకపోవడంతో ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన పరిస్థితి ఉంది. ఇలాంటి సంఘటనలు మండలంలోని కెమికల్ ఫ్యాక్టరీల్లో కోకొల్లలు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


వీరాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

బీర్కూర్, మార్చి 29: మండలంలోని ఐదు గ్రామాల్లో శుక్రవారం అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బీర్కూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో బరంగేడ్గి, బీర్కూర్, కిష్టాపూర్, చించోలి, మిర్జాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో వీరాపూర్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మిర్జాపూర్ విండో కార్యదర్శి జాకీర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్‌కు ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2303, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, పొల్కంపేట గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఆయన కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఏగ్రేడు ధాన్యానికి రూ.2203గా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు వారం రోజులలో డబ్బులు వారి ఖాతాలో జమచేస్తామని ఆయన తెలియజేశారు.

అవిశ్వాసంపై ఉత్కంఠ

- నేడు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- అవిశ్వాసంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చ
- ఉదయం క్యాంపు నుంచి కామారెడ్డికి చేరుకోనున్న కౌన్సిలర్లు
- అవిశ్వాసానికి దూరంగా ఉండనున్న బీజేపీ



కామారెడ్డి టౌన్, మార్చి 29: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న అవిశ్వాస చర్చకు నేడు తెరపడనుంది. గత 15 రోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ పాలకవర్గంలోని అన్ని పార్టీల కౌన్సిలర్లకు అవిశ్వాసంపై నిర్వహించే సమావేశానికి సంబంధించి నోటీసులు సైతం పంపిణీ చేశారు. అయితే అవిశ్వాసానికి సంబంధించి కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన రోజునే కాంగ్రెస్ కౌన్సిలర్లు 27 మంది క్యాంపునకు తరలారు. అయితే అవిశ్వాసానికి 34 మంది సంఖ్య బలం కావాల్సి ఉండడంతో కాంగ్రెస్ నాయకులు పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులతో సంప్రదింపులు జరుపగా అందులో 10 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసానికి మద్దతు ప్రకటించేందుకు సిద్ధపడి వారు సైతం క్యాంపునకు తరలారు. దీంతో చైర్‌పర్సన్‌కు మద్దతుగా కేవలం 5గురు కౌన్సిలర్లు మాత్రమే ఉండడంతో రాజీనామా చేస్తారనే పుకార్లు షికార్లు కొట్టాయి. కానీ శుక్రవారం వరకు ఎలాంటి రాజీనామా చేయకపోవడంతో అవిశ్వాసంను ఎదుర్కొనేందుకు చైర్‌పర్సన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే గోవా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అవిశ్వాసంపై చర్చించారు.

అవిశ్వాసం నెగ్గాలంటే మ్యాజిక్ ఫిగర్ 34 ఉండాల్సిందే..

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించేయాలంటే మ్యాజిక్ ఫిగర్ 34 మంది కౌన్సిలర్లు ఉండాలి. అయితే కామారెడ్డి మున్సిపల్‌లో మొత్తం 49 మంది కౌన్సిలర్లు ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్‌కు 27 మంది, బీఆర్‌ఎస్‌కు 16, బీజేపీకి 6 గురు కౌన్సిలర్లు ఉన్నారు. కానీ అవిశ్వాసం నెగ్గాలంటే మొత్తం 34 మంది కౌన్సిలర్లు కావాల్సి ఉండగా మరో 7 గురు కౌన్సిలర్లు కావాల్సి ఉంది. అవిశ్వాసానికి బీజేపీలో ఉన్న 6 గురు కౌన్సిలర్లు దూరంగా ఉండడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో బీఆర్‌ఎస్‌లో ఉన్న చైర్‌పర్సన్‌తో పాటు ఉన్న 15 మంది కౌన్సిలర్‌లలో 5 గురు మాత్రమే చైర్‌పర్సన్ వైపు ఉండగా మిగిలిన 10 మంది కౌన్సిలర్లు మాత్రం చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించేందుకు సహకరించేందుకు సిద్ధమయ్యారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసానికి సంఖ్య బలం 37గా ఉండనుంది. మ్యాజిక్ ఫిగర్ మాత్రం 34 మంది ఉండాల్సి ఉండగా మరో ముగ్గురు ఎక్కువగానే ఉండడంతో అవిశ్వాసం నెగ్గి చైర్‌పర్సన్‌కు పదవి వియోగం కలు గనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ పది మంది బీఆర్‌ఎస్ కౌన్సి లర్లపైనే చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి పదవిలో ఉంటారా లేదా అనేది ఆధారపడి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవేళ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం నుంచి ఏవైన ఆదేశాలు వచ్చి విప్ జారీ చేస్తే మాత్రం కౌన్సిలర్లలో ఎంత మంది అవిశ్వాసానికి మద్దతు ప్రకటిస్తారనేది నేడు తేలనుంది.

నేడు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్న కౌన్సిలర్లు

అవిశ్వాసంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వెంటనే క్యాంపునకు తరలిన కాంగ్రెస్ కౌన్సిలర్లు గత కొన్ని రోజులుగా గోవాలోనే ఉన్నారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం గోవాకు వెళ్లిన వేరే ప్రాంతంలో క్యాంపులో ఉన్నారు. క్యాంపులో కాంగ్రెస్ కౌన్సిలర్లలో పలువురు ఎక్కువ రోజులు ఇలా ఉండాలంటే తమ వల్ల కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేయడంతో వారిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అక్కడికి వెళ్లి సమన్వయం కుదిర్చారు. ఆ తర్వాత గత మూడు రోజుల కిందట కాంగ్రెస్ కౌన్సిలర్లు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వారితో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చర్చించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు కౌన్సిలర్లను తీసుకెళ్లి అవిశ్వాసంపై చర్చించారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు చేరుకోగా రెండు పార్టీల కౌన్సిలర్లు వేర్వేరు హోటల్‌లో బస చేస్తున్నారు. శనివారం అవిశ్వాసం ఉండడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్నారు.



ప్రశ్నిస్తే కేసులు పెట్టే నైజం వారిది

● ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు

మోస్రా, మార్చి 29: మోస్రా మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో మండల కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో వంద రోజులుగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై 60మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలకు 10ఏళ్ల అధికారంలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు చెట్టుకు ఒకరు పుట్టకు ఒకరు అయ్యారన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి శాసనసభ్యుడిగా గెలిచినా ఆయన కొడుకు మొన్ననే డీసీసీబీ డైరెక్టర్లు అవిశ్వాసం తీర్మానం చేయగా డీసీసీబీ ఉమ్మడి జిల్లా అధ్యక్ష పదవి పోయిందన్నారు. ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టించడం పోచారం కొడుకులకు పారిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ఇందులో యలమంచిలి శ్రీనివాస్, మోస్రా మండల కోకన్వీనర్ కొత్తకొండ భాస్కర్, మేక వీర్రాజు, నందు పటేల్, మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, బిల్లా రాజేశ్వర్ రెడ్డి, నర్సారెడ్డి, తదితరులున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఏనుగు రవీందర్ రెడ్డి



నందిపేటలోని వివేకానంద చౌరస్తాలో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు


చికిత్స పొందుతూ యువకుడి మృతి

● లక్కంపల్లి సెజ్ సిబ్బంది ఒత్తిడే కారణం అంటూ మృతదేహంతో బాధితుల రాస్తారోకో



మృతి చెందిన మహేష్

నందిపేట, మార్చి 29: మండల కేంద్రానికి చెందిన బొడ్డు మహేష్(36) అనే యువకుడు శుక్రవారం ఆసుపత్రి చికిత్స పొందుతూ మరణించారు. మండలంలోని లక్కంపల్లి సెజ్ సిబ్బంది ఒత్తిడి కారణంగా మహేష్ మృతి చెందినట్టు ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుక్రవారం మండల కేంద్రంలోని వివేకానందచౌరస్తాలో మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని హన్మాన్ గల్లీకి చెందిన బొడ్డు మహేష్ అనే యువకుడు గత కొన్ని సంవత్సరాలుగా మండలంలోని లక్కంపల్లి శివారులో ఉన్న ఫుడ్ పార్క్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 10న మహేష్‌పై కుక్క దాడి చేయడంతో తీవ్ర రక్తస్రవం ఆసుపత్రిలో చిక్క పొందుతున్నాడు. సెజ్‌లోని సిబ్బంది ఒత్తిడి కారణంగా కుక్క కాటువేసినప్పటికీ పనిలో చేరాడు. శుక్రవారం ఉదయం తీవ్ర జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బొడ్డు మహేష్ మృతి చెందాడు. మహేష్ మృతికి సెజ్ యాజమాన్యం, సిబ్బంది కారణమంటూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు మహేష్ మృతదేహంతో మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తూ కారకులైన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

















వర్నిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

వర్ని,మార్చి29: వర్ని మండల కేంద్రంలో శుక్రవారం తెలుగు దేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు దేశం పార్టీ నాయకులు, నందమూరి అభిమానులు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీని స్థాపించి అనతికాలంలోనే అధికారంలోకి వచ్చిన ఘనత ఎన్‌టీఆర్‌దేనని ప్రశంసించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విఠల్, నాయకులు రాజారావు, వినోద్, ఇందూరు సాయిలు, వెంకటేష్, చక్రధర్ రావు, సత్యనారాయణ, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

'మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు'

బోధన్ రూరల్, మార్చి 29: బోధన్ , సాలూర మండలాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని బోధన్ ఎంఈఓ నాగనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో అపరిచిత వ్యక్తులను లోపలికి పంపించవద్దని సూచించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కష్ట పడి కాకుండా ఇష్ట పడి చదివి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు బీఆర్ఎస్ నాయకుల సమావేశం

ముప్కాల్, మార్చి 29: బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 11గంటలకు ఉమ్మడి బాల్కొండ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ముఖ్య అతిథులుగా బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిలు హాజరు కానున్నట్టు తెలిపారు. అనంతరం బాల్కొండ మండల కేంద్రంలో సాయంత్రం జరిగే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వారు పాల్గొనున్నట్టు ఆయన తెలిపారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యం: ఎంపీ అరవింద్



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

బోధన్ రూరల్, మార్చి 29: మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరవింద్ అన్నారు. శుక్రవారం బోధన్‌లో బీజేపీ నియోజకవర్గ కార్యకర్తలతో అంతర్గత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి పార్టీని గెలిపించుకునే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటిప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకట రమణి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, వివిధ మండలాల అధ్యక్షులు ఉన్నారు.

నేడు అవిశ్వాస తీర్మానంపై సమావేశం

డిచ్‌పల్లి, మార్చి29: డిచ్‌పల్లి మండలపరిషత్ అధ్యక్షుడు గద్దెభూమన్న అలియాస్ శ్రీనివాస్‌పై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌డీవో నిజామాబాద్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని, ఎంపీపీ ఆవరణలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎంపీడీవో అనిల్ కుమార్ పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

సీఎంని కలిసిన డీసీసీబీ చైర్మన్

ఆర్మూర్ రూరల్, మార్చి 29: ఇటీవల డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన కుంట రమేష్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు కుంట రవీంధర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డొంకేశ్వర్: పార్లమెంట్ అభ్యర్థితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీ వైస్‌చైర్మన్ దేగం గంగారెడ్డి కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి శాలువతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం జిల్లా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని సీఎం కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలిపారు.

ముప్కాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి శాలువతో సత్కరించి నాగలిని బహుకరించారు. ఈ సందర్భంగా వేంపల్లి సొసైటీలో ఉన్న సమస్యలపై చర్చించినట్టు ఆయన తెలిపారు. సొసైటీ అభివృద్ధి దృష్ట్యా నిధులు మంజూరు చేయాలని సీఎంను విన్నవించగా. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీ వైస్‌చైర్మన్ దేగం గంగారెడ్డి

సహకార సంఘాల్లో రుణ పరిమితిని పెంచాలి

● హున్సా సొసైటీ అధ్యక్షుడు మందర్న రవి ● బోధన్ డివిజన్ పరిధిలోని పలు వ్యవసాయ సహకార సంఘాలలో 88వ మహాజన సభలు ● పెద్దసంఖ్యలో పాల్గొన్న ఆయా గ్రామాల రైతులు

బోధన్ రూరల్, మార్చి29: సహకార సంఘాల్లో రైతులకు ఇచ్చే రుణ పరిమితిని పెంచాలని కొత్త సభ్యత్వాలు కల్పించాలని హున్సా సొసైటీ అధ్యక్షులు మందర్న రవి అన్నారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంలోని హున్స సహకార ంఘంలో మహాజన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ కార్యలయం కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సంఘ సభ్యులందరూ ఏకగ్రావ తీర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కులకర్ణి వినోద్ బాబా, డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, బి.రమేష్, డి. రాములు, బుద్ద సంగ్రాం, సిద్దార్థ్, సొసైటీ సీఈఓ ముద్ద హన్మంత్‌రావు, హున్సా, మందర్న, ఖాజాపూర్ గ్రామాల రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● 'ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి'

రుద్రూరు: రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా చూడాలని 88వ మహాజనసభలో రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం సమావేశాన్ని చైర్మన్ సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి సంఘానికి సంబంధించి ఆరు నెలలకు సంబంధించిన ఆదాయ వ్యయాలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఈ సందర్భంగా రైతులకు హామీనిచ్చారు. సహకార సంఘం అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి సహకార సంఘం ఆధ్వర్యంలో మళ్ళీ రుణాలు అందించాలని రైతులు కోరారు. సహకార సంఘం చైర్మన్ ఆధ్వర్యంలో నూతన గోదాం నిర్మించినందుకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, జడ్పీటీసీ నారోజీ గంగారాం, డైరెక్టర్లు గజేందర్, అశోక్, గోపి, గంగారాం, లలిత, గంగారాం, సీఈవో జి.లక్ష్మణ్, అక్కపల్లి నాగేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● 'ఏకకాలంలో పంట రుణాలను మాఫీ చేయాలి'

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో 2లక్షల రూపాయల పంట రుణాలను మాఫీ చేయాలని నాగేపూర్ సొసైటీ మహజన సభలో తీర్మానించారు. శుక్రవారం ఫకీరాబాద్‌లోని సొసైటీ కార్యాలయం ఆవరణలో చైర్మన్ శైలేష్ కుమార్ దేశ్‌ముఖ్ అధ్యక్షతన మహజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. యాసంగి పంటలకు సంబంధించి త్వరలో ఏర్పాటు చేయబోయే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ప్రతి క్వింటాలు ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర చెల్లించడంతో పాటు 500రూపాయల చొప్పున అదనంగా బోనస్ చెల్లించాలని తీర్మానించారు. సెప్టెంబర్ 2023నుండి ఫిబ్రవరి 2024వరకు ఆరు మాసాల పాటు సొసైటీలో జరిగిన జమ, ఖర్చుల వివరాలను కార్యదర్శి రమేష్ సభ్యులకు చదివి వినిపించారు. సొసైటీ 4.38లక్షల రూపాయల లాభాలతో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శైలేష్ కుమార్ దేశ్‌ముఖ్, డైరెక్టర్లు శ్రీనివాస్ రావు, బేగరి సాయిలు, రాజలింగం రవీందర్, వీరన్న, నీలం సాయిలు, అంబర్ సింగ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● పాలకవర్గాన్ని రద్దు చేయకపోవడంపై ఆగ్రహం

కోటగిరి: పొతంగల్ విండో పాలకవర్గాన్ని రద్దు చేయాలని గత జనరల్ బాడీ సభలో తీర్మానం చేసిన అదే పాలకవర్గం కొనసాగించడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం లావాదేవీల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే విండో కార్యదర్శితో పాటు పాలకవర్గాన్ని రద్దు చేయాలని మరోమారు సభ్యులు డిమాండ్ చేశారు. పొతంగల్ విండో మహజన సభ శుక్రవారం విండో అధ్యకులు, డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే సభ్యుల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. గతంలో చేసిన తీర్మానాలను అమలు చేయకపోవడంపై సభ్యుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పాలకవర్గాన్ని రద్దు చేయాలని తీర్మానం చేస్తే విండో అధ్యకులు కోర్టు నుంచి స్టే తీసుకురావడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సంఘంలో కోట్ల రూపాయల ఇన్‌కమ్ ట్యాక్స్, సేల్ ట్యాక్స్ సకాలంలో చెల్లించకపోవడంతో సంఘానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. రైస్ మిల్ తౌడు సైతం లెక్కలు లేకుండా పోయ్యాయన్నారు. బ్యాంకులో 12లక్షలు, పీఎఫ్‌లో 7లక్షలు నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. బియ్యం దుకాణాల్లోనూ లెక్కలు సక్రమంగా లేకపోవడంపై సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. సంఘంలో లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేయాలని మరోమారు తీర్మానం చేశారు. విండో కార్యదర్శిపై తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సహకార సంఘం అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన సలహా కమిటీకి సొసైటీ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందులో విండో పాలకవర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ పవన్, సభ్యులు విజయ్ పటేల్, వాసు, తదితరులు పాల్గొన్నారు.



హున్సా మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రవి



రుద్రూరులో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి



నాగేపూర్ సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ శైలేష్‌కుమార్ దేశ్‌ముఖ్



పొతంగల్ విండో చైర్మన్‌పై మండిపడుతున్న సభ్యులు

భక్తిశ్రద్ధల మధ్య గుడ్‌ఫ్రైడే వేడుకలు

బోధన్ రూరల్/ ఎడపల్లి, మార్చి 29: బోధన్ పట్టణం, బోధన్, సాలూర, ఎడపల్లి మండలాల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర, సోదరీమణులు ఘనంగా జరుపుకుని, చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ వేయబడిన రోజును స్మరించుకుంటూ బోధన్ పట్టణంలోని రాకాసిపేట, ఆచన్‌పల్లి, జాడిజమాల్ పూర్ గ్రామాలతో పాటు ఎడపల్లి మండల కేంద్రంలోని బెతానియా ఫెలోషిప్ చర్చితో పాటు వడ్డాపల్లి, ఎమ్మెస్సీ పారం, పోచారం, ఏఆర్పీ క్యాంపు గ్రామాలలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఏసు క్రీస్తు శిలువలో చివరగా పలికిన ఏడు మాటలను ఎడపల్లి చర్చి ఫాదర్ తిమోతి రాజు భక్తులకు బోధించి గుడ్ ఫ్రైడే అవశ్యకతను తెలియజేశారు. క్రీస్తు మరణించి తిరిగి లేచిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను నిర్వహించనున్నట్లు పాస్టర్ తిమోతి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలలోని క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం చర్చిల దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి, తొరికొండ, పడకల్, కొలిప్యాక్, తదితర గ్రామాల్లో చర్చీలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. పాస్టర్‌లు, క్రిస్టియన్ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



రాకాసిపేట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవీపేట, మార్చి29: మండలంలోని రాంపూర్, నవీపేట, కమలాపూర్, కోస్లీ, యంచ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని, ఏఈఈ ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. 4వ శనివారంను పురస్కరించుకుని ఆయా సబ్ స్టేషన్‌లలో చేపట్టబోయే మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరా అంతరాయానికి సహకరించాలని వారు కోరారు.



డిప్యూటి డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మరణించిన ఆశా కార్యకర్తకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

● సీఐటీయూ నాయకుల డిమాండ్

ఎడపల్లి, మార్చి 29: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించి పని నిమిత్తం బయటకు వచ్చిన ఆశా వర్కర్ అబ్బమ్మ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని, మృతి చెందిన అబ్బమ్మ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఉప జిల్లా వైద్యాధికారి విద్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జమ్మిశెట్టి శంకర్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆశా కార్యకర్తకు రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని, ఆశా వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, మరణించిన కార్మికురాలి కుటుంబంలో ఒకరికి ఆశా వర్కర్ ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు జరుగకుండా ప్రభుత్వం పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఈ సమస్యలన్నిటినీ పరిష్కారం చేయలేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ జిల్లా నాయకురాలు గైని రాజమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏశాల గంగాధర్, జిల్లా నాయకులు జంగం గంగాధర్, కటారి రాములు, ఆశా వర్కర్ల వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు అనసూయ, రాజేశ్వరి, పద్మ, సుజాత, తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని చేరుకున్న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

● పోచంపాడ్‌లో 75.16 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ● జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బందికి చీఫ్ ఇంజనీర్ అభినందనలు

మెండోర, మార్చి 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ ప్రధాన కాలువ కాకతీయకు అనుసంధానంగా ఉన్న పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకుందని చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం ఈ ఆర్థిక సంవత్సరంలో 75మిలియన్ యూనిట్ల విద్యుత ఉత్పత్తిని ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులు నిర్దేశించారు. దీంతో ఖరీఫ్, రవి పంటలకు కాకతీయ కాలువ నుంచి విడుదల చేసిన నీటిని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా విడుదల చేసి విద్యుత్ ఉత్పత్తిని పూర్తిస్థాయిలో చేయగలిగారు. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు టార్బయిన్లు ఉండగా ఒక్కో టార్బయిన్ ద్వారా తొమ్మిది మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, నాలుగు టార్బయిన్‌ల ద్వారా 36మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేయగలుగుతుంది. పోచంపాడ్ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 1987జులై 12వ తేదీన ఒక్కో టార్బయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. 1987 అక్టోబర్ 24వ తేదీన రెండో టార్బయిన్ ద్వారా రెండు విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. 1988 మార్చి 31వ తేదీన మూడో టర్బాయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరిగింది. 2010 అక్టోబర్ 12వ తేదీన నాలుగు టార్బయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి కొనసాగించారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత ఉత్పత్తి కేంద్రంలో 1989-90సంవత్సరంలో 125.45మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 1998-99సంవత్సరంలో 137.95మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 1990-91లో 146.4మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 2022-23లో 138.42మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది.



పోచంపాడ్ జలవిద్యుత్ కేంద్రంలో టర్బాయిన్లు

ఇందులో రికార్డు విద్యుత్ ఉత్పత్తి 146.4మిలియన్ ఉత్పత్తి జరిగిందని తెలిపారు.

● జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బందికి అభినందనలు

పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో చీఫ్ ఇంజనీర రమేష్‌బాబు శుక్రవారం జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఇంజనీర్లు, సిబ్బందిని అభినందించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని 75.16మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అధికమించడంతో ఇంజనీర్లు సిబ్బంది కృషి వెలకట్టలేనిదని అన్నారు.

'ప్రజలకు విలువ ఇచ్చే వారికే ఓటు వేయండి'

నందిపేట, మార్చి 29: రాజకీయ పరంగా ప్రజలకు విలువ ఇచ్చే వారికే ఓటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. శుక్రవారం నందిపేట మండల కేంద్రంలోని నందీశ్వర ఆలయంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్.సురేష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా జమ మసీదు వరకు ఉన్న వ్యాపార సముదాయాల వెంట వ్యాపారస్తులను, అలాగే కూలీలను కలుస్తూ ఓట్లను అభ్యర్థించారు. హెయిర్‌కటింగ్ సెలూన్‌లో కటింగ్ చేస్తూ, అలాగే హోటల్‌లో టీ తాగుతూ ఓట్లను అభ్యర్థించారు. అనంతరం సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఓటు హక్కు అమూల్యమైందని ఆ ఓటు గుర్తింపు ఉన్న వారికే వేయాలని కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలకు విలువలు లేవని, అసలు వారు మాట్లాడే బాష విడ్డూరంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో ఇప్పటికీ అమలు కాలేదని ఆయన విమర్శించారు. ప్రజలు బీజేపీకి, కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేశామని మదన పడుతున్నారని, తమ దగ్గరికి వచ్చి తప్పయ్యిందని గగ్గోలు పెడుతున్నారని బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఇకనైనా సమర్థులైన అభ్యర్థికి ఓటు వేయాలని వారికి సూచించానని, గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని అందించిన పథకాలను చూసి ఓట్లు వేయాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. అంతకు ముందు రాజ్యసభ సభ్యుడు కేఆర్. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలు సస్యశ్యామలం కావడానికి తానే కారణమని ఉమ్మడి రాష్ట్రంలో పలు మార్లు ఎమ్మెల్యేగా పని చేసిన నేను ప్రతీ గ్రామానికి సాగునీరు అందించడానికి ఏపీసీ, నాబార్డు నిధులతో ఎత్తిపోతల పథకాలను నిర్మించినట్టు వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్మూర్ మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, పట్టణ అధ్యక్షుడు కొత్తూరు బాస్కర్, కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్, మాజీసర్పంచ్‌లు, తదితరులు ఉన్నారు.



నందీకేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి



..ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా వినోద్

రాజంపేట, మార్చి 29: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మండలంలోని నడిమితండా గ్రామ మాజీ సర్పంచ్ వినోద్ నియామకం అయ్యారు. శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ మాట్లాడుతూ మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో వినోద్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేర్‌సింగ్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అమర్లబండ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

సదాశివనగర్, మార్చి 29: సదాశివనగర్ మండలం అమర్లబండ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు అన్వేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనుకంటి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కుంట రతన్, కార్యదర్శిగా కొత్తురు స్వామి, కోశాధికారిగా గుండెలు రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జీగా భాస్కర్, యూత్ కమిటీ అధ్యక్షుడిగా పరీధిపేట అశోక్, ఉపాధ్యాక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్ తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

రామారెడ్డి, మార్చి 29: మండలంలోని పోసానిపేటకు చెందిన బలగం రాజయ్య కుమారుడు శ్రీకాంత్‌కు శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎల్‌వోసీ అందజేశారు. అనారోగ్యం భారిన పడిన రాజయ్య నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో రూ.5లక్షల ఎల్‌వోసీని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, బీసీసెల్ ఉపాధ్యక్షుడు నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సాయికుమార్‌ను సన్మానిస్తున్న ఎస్టీ సెల్ నాయకులు

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఎస్టీ సెల్ నాయకులు

కామారెడ్డి టౌన్, మార్చి 29: రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను శుక్రవారం జిల్లా ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులు కాంగ్రెస్ పట్ల సానుభూతి చూపిస్తూ వెన్నంటి ఉండడం వల్లనే మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చాలా చోట్ల భారీ మెజార్టీ సాధించిందని తెలిపారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎంపీలను గెలిపించేందుకు తోడ్పాటు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ రాణాప్రతాప్ రాథోడ్, నాయకులు వినోద్‌నాయక్, ప్రకాష్‌నాయక్, మదన్‌లాల్, సీతారాంనాయక్, రామ్‌సింగ్ నాయక్, మునియా నాయక్, పెంట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వేతనాలు చెల్లించాలని కార్మికుల నిరసన

బాన్సువాడ టౌన్, మార్చి 24: బకాయిపడ్డ నాలుగు నెలల వేతనాలు చెల్లించాలంటూ ఆస్పత్రి కార్మికులు శుక్రవారం ప్రభుత్వ ఏరియాస్పత్రి ముందు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఏరియాస్పత్రి, ఎంసీహెచ్‌లలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, పేషెంట్‌కేర్ కార్మికులకు సంబంధిత ఏజెన్సీ నిర్వాహకుడు నాలుగు నెలలగా వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు చెల్లించే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేణుక, సంతోష్‌గౌడ్, కమర్, గంగారాం, సురేఖ, పోచవ్వ, గంగవ్వ, తదితరులున్నారు.



తాడ్వాయిలో పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శబరిమాత పల్లకీసేవ

తాడ్వాయి, మార్చి 29: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం రాత్రి అమ్మవారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ముందుగా శబరిమాత అమ్మవారి పాలరాతి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శబరిమాత అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు పల్లకీసేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థిని అదృశ్యం

బీర్కూర్, మార్చి 29: బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని బీర్కూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. శుక్రవారం చివరి పరీక్ష రాసిన ఆ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మళ్లీ అవకాశం ఇస్తే మరింత సేవ చేస్తా..

బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

సదాశివనగర్, మార్చి 29: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా మరోమారు అవకాశం ఇచ్చి గెలిపిస్తే మరింత సేవ చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లన్నగుట్ట వద్ద గల అశోక్‌గార్డెన్‌లో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి సదాశివనగర్, రామారెడ్డి మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలు నిరంతరంగా ప్రజాసేవ చేశానన్నారు. ఇప్పటి వరకు ఏ కార్యకర్త తన దగ్గరికి వచ్చినా ఆప్యాయతతో వారి బాధలను పంచుకుని అండగా నిలబడ్డానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ పభారి బద్దం మహిపాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవిగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, మర్రి రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాల బైరవస్వామి ఆలయంలో పూజలు

రామారెడ్డి: కాల బైరవ స్వామి ఆలయంలో బీబీ పాటిల్ శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీగా గెలిచిన అనంతరం ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైల కృష్ణారెడ్డి, కట్ట ఈశ్వర్, గడ్డం ప్రసాద్, దేవిదాస్, సందీప్, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

లింగంపేట: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని బీబీ పాటిల్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని గుర్తించి బీజేపీలోకి వచ్చానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, సుభాష్‌రెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

గాంధారి: తనను భారీ మెజార్టీతో గెలిపించి మోదీని ప్రధానిని చేయాలని బీబీ పాటిల్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం బీజేపీ పార్టీ పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ కిషన్‌రావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

జహీరాబాద్ గడ్డపై కాషాయ జెండా ఎగరాలి

ఎల్లారెడ్డి రూరల్: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగుర వేసేందుకు ప్రతీ కార్యకర్త కంకణ బద్ధులు కావాలని బీబీ పాటిల్ అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎనిమిది మండలాల్లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాలను నిర్వహించారు. ఎల్లారెడ్డి, సదాశివనగర్, గాంధారి, లింగంపేట్, తాడ్వాయిలో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిన మోదీనే మరోసారి ప్రధాని అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రవి గౌడ్, ప్రభారి మహిపాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ లింగారావు, కో కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

కామారెడ్డి టౌన్, మార్చి 29: కామారెడ్డి మున్సిపాలిటీలోని 27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం కామారెడ్డి మున్సిపల్‌లో నిర్వహించే అవిశ్వాసంపై వివరించారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి పదవిని దుర్వినియోగం చేస్తూ అనేక అవినీతి అక్రమాలు చేశారని చాలా సార్లు ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేశాయని తెలిపారు. సొంత పార్టీ కౌన్సిలర్లు సైతం వీరి ఆగడాలపై వివరించారని ఒక దశలో చైర్‌పర్సన్‌ను మార్చాల్సిందేనని పట్టుబట్టారని అన్నారు. దీంతో కామారెడ్డి పట్టణ అభివృద్ధికి బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానంను కలెక్టర్‌కు అందించారని తెలిపారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అవిశ్వాసంపై వివరించడంతో పాటు కామారెడ్డి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు, కౌన్సిలర్లు పాక జ్ఞానేశ్వరీ రవికుమార్, ఉరుదోండ వనిత, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న కౌన్సిలర్లు

సీఎంను కలిసిన డీసీసీబీ జిల్లా డైరెక్టర్

గాంధారి, మార్చి 29: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సీఎంను కోరినట్లు సాయికుమార్ తెలిపారు. సీఎం సానుకూలంగా వ్యవహరించినట్లు ఆయన తెలిపారు.



రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్

సీఎంను సన్మానించిన పీసీసీ కార్యదర్శి

భిక్కనూరు: సీఎం రేవంత్‌రెడ్డిని పీసీసీ కార్యదర్శి మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి సీఎంను శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఆర్గొండ సొసైటీ సీఈవోపై సభ్యుల ఆగ్రహం

రాజంపేట, మార్చి 29: ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు పదిహేను వేల రూపాయలు ఇవ్వాలని, అలాగే రూ.2 లక్షలు ఏక కాలంలో రుణమాఫీ చేయాలని రాజంపేట సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్ తెలిపారు. మండలంలోని రాజంపేట, ఆర్గొండ గ్రామాల సొసైటీ చైర్మన్ అశోక్, కంది శివరాములు ఆధ్వర్యంలో మహాజన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవోలు సొసైటీలకు సంబంధించిన చిట్టాపద్దులను కార్యదర్శులు, సభ్యులకు చదివి వినిపించారు. ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏప్రిల్ 2023 నుంచి డిసెంబరు 2023 వరకు రైతు వేదిక ఉత్సవాలలో ఖర్చులు రెండు లక్షల ఆరవై వేల ఆరు వందలపై సీఈవో సాయిలును సభ్యులు వివరాలు అడిగారు. ఖర్చులలో అవకతవకలు ఉన్నాయని అధ్యక్షులను వివరణ అడగగా రైతువేదిక ఉత్సవాలలో ఒక రైతువేదికకు వెయ్యి మందికి భోజనాలు పెట్టించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్గొండ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్గొండ, కొండాపూర్ రెండు రైతువేదికలు ఉన్నాయని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిల్లులతో సహా సభ్యులకు వివరించారు. సొసైటీలో ఆరు నెలలకు ఒకసారి మహాజన సభ నిర్వహించడం లేదని నామ మాత్రంగా డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి వదిలేస్తున్నారని సంబంధిత అధికారులు ఈ విషయంపై విచారించాలని సభ్యులు కోరారు. సొసైటీ ఆధ్వర్యంలో సంతాయిపేట సబ్ సెంటర్ కాకుండా సెంటర్ నియమించాలని రెండు సీజన్‌ల వరి పంట అధికంగా గ్రామంలో పడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి సొసైటీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, ఎంపీటీసీ సాగర్, డైరెక్టర్‌లు బుట్ట రాజు, మధుకర్, మల్లారెడ్డి, బాలయ్య, బసవయ్య, సాయిబాబా, బాగయ్య, సీఈవోలు సాయిలు, వెంకటేశ్వర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రైతులు లింగాకర్షక బుట్టలు వాడుకోవాలి

తాడ్వాయి, మార్చి 29: రైతులు తమ పొలాల్లో లింగాకర్షక బుట్టలు వాడుకోవాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామంలోని రైతుల పొలంలో శుక్రవారం విద్యార్థులు లింగాకర్షక బుట్టలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ లింగాకర్షక బుట్టలను తమ పొలంలో ఏర్పాటు చేసుకున్నట్లయితే చీడపీడల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కర్, విద్యార్థులు విశ్వజ, ప్రీతి, శ్రేష్ఠ, శ్వేత, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమల్లారెడ్డిలో కేంద్ర బలగాల కవాతు

భిక్కనూరు, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధానవీధుల గుండా భిక్కనూరు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్, రాంచంద్రనాయక్, దోమకొండ ఎస్సై గణేష్, రాజంపేట ఎస్సై సంపత్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

బీర్కూర్, మార్చి 29 : మండలంలోని ఆయా చర్చిలల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ గత 40 రోజులుగా క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేపట్టారు. దీక్షలు గురువారంతో ముగిసాయి. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంటలు మోగించారు. చర్చి ఫాదర్ మాట్లాడుతూ సర్వ మానవాళి కోసం యేసు ప్రభు చేసిన కృషి, త్యాగాలను క్రైస్తవ సోదరులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఏద వర్షిప్ సెంటర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

లింగంపేట, మార్చి 29: మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి వడ్ల రాంచందర్ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు పత్రిక ప్రకటన విడుదల చేశారు. గత 18 సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందించానని ఇటీవల మండల పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన శ్రీనివాస్ పార్టీ కార్యకలాపాలను కార్యకర్తలకు తెలియజేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని దానికి మనస్తాపం చెంది పదవికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని ఆయన కోరారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

గాంధారి, మార్చి 29: సింగిల్ విండో పరిధిలో రైతులకు ఉపయోగపడే పనులను చేయాలని సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎరువుల కోసం పేట్‌సంగం, గుర్జల్, నేరల్ గ్రామాల్లో గోదాముల నిర్మాణాలు చేపట్టాలని తీర్మానం చేశారు. దీంతో రైతులకు ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విండో కార్యదర్శి మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, డైరెక్టర్లు సాయిలు, లక్ష్మణ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



సింగిల్ విండో సభను నిర్వహిస్తున్న దృశ్యం



కాంగ్రెస్‌లో చేరుతున్న దృశ్యం

కాంగ్రెస్‌లో చేరిన జాగృతి జిల్లా కన్వీనర్

భిక్కనూరు, మార్చి 29: తెలంగాణ జాగృతి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాం వెంకటేష్‌తో పాటుగా నవీన్‌రెడ్డి, నితీష్‌గౌడ్ బీఆర్ఎస్‌కు, జాగృతికి రాజీనామా చేసి శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీరాం వెంకటేష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా సురేష్‌షెట్కార్ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు కుంట లింగారెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కామారెడ్డికి హరీష్‌రావు రాక

కామారెడ్డి టౌన్, మార్చి 29: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్యగార్డెన్‌లో ఆదివారం నిర్వహించే కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపారు. ప్రతీ కార్యకర్త సమావేశానికి హాజరు కావాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు వివరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నిజాంసాగర్, మార్చి 29: మండలంలోని చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన చెన్నబోయిన అనిల్(28) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పెండ్లిలో డ్యాన్స్ చేయవద్దని భార్య చెప్పడంతో క్షణికావేశంలో చెట్టుకు ఉరి వేసకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

నేటి నుంచి సిద్ధరామేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

భిక్కనూరు, మార్చి 29: మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. మొదటి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు, పుణ్యాహవచనం, మాతృకనాంది, అంకురార్పణం, అఖండ దీపారాధన, స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సిద్ధగిరి సమాధి వద్దకు ఊరేగింపుగా వెళ్లివచ్చుట, 31న ఆదివారం అగ్ని ప్రతిష్ఠ, దేవాతాహోమం, ధ్వజారోహణం, బలిహరణ, ఎడ్లబండ్ల ఊరేగింపు, వీరభద్ర ప్రస్తావన, అగ్నిగుండాలు, ఏప్రిల్ 1న సోమవారం సిద్ధగిరి సమాధి వద్ద పూజలు, స్వామివారి కల్యాణం, రాత్రి సదాశివ మహంత్ ఉగ్రరూపుడై సిద్ధగిరి సమాధి వద్ద నుంచి ఆలయానికి వచ్చుట, స్వామివారి విమాన రథోత్సవం, 2న మంగళవారం స్వామి వారికి అవబృధ స్నానం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, 3న బుధవారం నాకబలి, క్షేత్రపాలకబలి, పూర్ణాహుతి, సిద్ధగిరి సమాధి వద్దకు ఊరేగింపుగా వెళ్లి రావడంతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు. ఈ ఆలయ బ్రహ్మోత్స వాలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



స్వామి వారి మూలవిరాట్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- రజాకార్, ఆడు జీవితం
శాంతి	- ప్రేమలు
ప్రియా 70	- గాడ్జిల్లా ఎక్స్ కింగ్
ప్రియా 35	- ఓ భీం బూష్

బాన్సువాడ

మహేశ్వరి	- టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర	- రజాకార్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

